ఎమ్మెల్యే విజయీభవ యాత్ర

- నేడు ఏఎస్‌పేట మండలం హసనాపురం నుంచి ప్రారంభం
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ప్రతి మండలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పాలనను మరొక్కసారి ప్రజలు అందరికి గుర్తు చేస్తూ, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహిస్తున్న విజయీభవ యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం సాయంత్రం ఆత్మకూరులోని ఎమ్మెల్యే మేకపాటి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రతినిధులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహిస్తున్న విజయీభవ యాత్ర ఆదివారం ఉదయం 10 గంటలకు ఏఎస్‌పేట మండలం హసనాపురం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ నెల 23న ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటలకు నరసాపురం, మధ్యాహ్నం 12 గంటలకు శాంతినగర్, మధ్యాహ్నం 3.30 గంటలకు వెంకట్రావుపల్లి, సాయంత్రం 6 గంటలకు జాలయ్యనగరం, సాయంత్రం 7 గంటలకు ముస్తాపురంలో కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూనం సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, అంద్రా రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు మొలబంటి రాజశేఖర్, దగుమాటి శివకోటారెడ్డి, నాయకులు నోటి వినయ్‌కుమార్, అంద్రా సుబ్బారెడ్డి, యానాదిరెడ్డి, నరేంద్రరెడ్డి, బ్రహ్మనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మేకపాటి యాత్రను జయప్రదం చేయండి

అనుమసముద్రంపేట: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఉదయం 10 గంటలకు హసనాపురం నుంచి తలపెట్టిన విజయీభవ యాత్రను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జేసీయస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, రాజవోలు సొసైటీ చైర్మన్ కల్లూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ కాటంరెడ్డి నారసింహారెడ్డి కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. నేడు విజయీభవ యాత్ర ద్వారా ప్రజల మధ్యకు వస్తున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి సాదర స్వాగతం పలికేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ యాత్రకు మండలంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


ఎమ్మెల్యే మేకపాటికి జ్ఞాపికను బహూకరిస్తున్న బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి

విజయీభవ యాత్ర విజయవంతం కావాలి

సోమశిల: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం నుంచి ప్రారంభించనున్న విజయీభవ యాత్ర విజయవంతం కావాలని, ఎటువంటి విఘ్నాలు లేకుండా దిగ్విజయంగా సాగాలని కోరుకుంటున్నట్లు అనంతసాగరం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం నెల్లూరులో మేకపాటి విక్రమ్‌రెడ్డిని కలిసి ఎలాంటి విఘ్నాలు లేకుండా విజయీభవ యాత్ర సాగాలంటూ విఘ్నేశ్వరుడి జ్ఞాపికను ఎమ్మెల్యేకు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధిని చెప్పండి


బత్రకాగోళ్లు వలంటీర్లు, నాయకులతో ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

- వలంటీర్లు, నాయకులతో ఆత్మీయ సమావేశం

అల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు మళ్లీ మళ్లీ చెప్పాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సతీమణి ఆదిలక్ష్మి చెప్పారు. మండలంలోని బత్రకాగోళ్లు, గ్రద్దగుంట, సింగపేట వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లతో ఆమె శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల మద్దతుతో 2024లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని దిశా నిర్దేశం చేశారు. త్వరలోనే ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కూడా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. మన ప్రభుత్వం, గత ప్రభుత్వం పాలన పోల్చి ప్రజలకు వివరించాలన్నారు. ఎంపీపీ శశిరేఖ, వైస్ ఎంపీపీ సురేంద్ర, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, దాసరి మల్లి, నిమ్మల భాస్కర్, షేక్ ఉస్మాన్, సుధా, రసూల్, శ్రీహరి, శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తూపిరి పెంచలయ్య మృతి


తూపిరి పెంచలయ్య (ఫైల్)

బిట్రగుంట: బోగోలుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ తూపిరి పెంచలయ్య (83) గుండెపోటుతో శనివారం వేకువన మృతి చెందారు. తూపిరి పెంచలయ్య గతంలో రెండు సార్లు బోగోలు సర్పంచ్‌గా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పార్టీకి, ప్రజలకు సేవలందించారు. ప్రస్తుతం జిల్లా కమిటీ సభ్యుడిగా క్రియాశీలకంగా పని చేస్తున్నారు. వివాదారహితుడిగా, అజాత శత్రువుగా పేరొందారు. ఇంట్లో నిద్రిస్తుండగానే గుండెపోటుకు గురై మృతి చెందారు. పెంచలయ్య మరణ విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దిగ్భ్రాంతి చెందారు. హుటాహుటిన బోగోలుకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెంచలయ్య పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెంచలయ్య మృతి పార్టీకి తీరని లోటుని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలకు అతీతంగా భారీగా పెంచలయ్య ఇంటి వద్దకు చేరుకుని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌తో కావలి ఎమ్మెల్యే



కావలి: విజయవాడలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా హాజరైన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. నడుచుకుంటూ వస్తూ పలు విషయాలు సంభాషించుకున్నారు.

23 నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు


సీఆర్‌ఎంటీలకు సూచనలిస్తున్న ఎంఈఓ

ఉదయగిరి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 23వ తేదీ నుంచి ఎఫ్‌ఏ-3 పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ-1 షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఆయన తన కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో సమీక్షించారు. ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లను బాధ్యతగా సీఆర్‌ఎంటీలు స్కూల్ కాంప్లెక్స్‌లకు చేర్చుకోవాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ ఏ రోజు పరీక్షకు ఆ రోజే కాంప్లెక్స్ పాఠశాల నుంచి ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్ షీట్లు హెచ్‌ఎంలు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అలీం, సీఏ వశీం, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికల తయారీపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

ఉదయగిరి: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీపై దృష్టి సారించాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ తెలిపారు. ఆమె శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సంబంధిత సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 27న గ్రామ సభలు నిర్వహించి ఆమోదించి నివేదిక అందించాలన్నారు. మండలంలో జరుగుతున్న కులగణనను తరచూ పర్యవేక్షిస్తూ సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేయాలి. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి ఈకేవైసీ చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ ఎన్.మల్లికార్జున, ఏఓ రేణుకా తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ల మరమ్మతులు షురూ

కావలి: పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్లకు ఎట్టకేలకు మరమ్మతు పనులు మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది శనివారం ప్రారంభించారు. మూడు నెలల క్రితం దెబ్బతిన్న పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో ఎట్టకేలకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఈ తరహా పైప్‌లు హైదరాబాద్‌లో మినహా ఎక్కడా తయారీ లేకపోవడం, తయారీ సంస్థతో మాట్లాడి స్థానికంగా అవసరాలకు అనుగుణంగా పైప్‌లు తయారు చేయించడంతో మూడు నెలల పాటు జాప్యం ఏర్పడింది. కావలి పట్టణంలో సుమారు 2 లక్షల మంది జనాభాకు తాగునీరు అందించేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. 1999లో అప్పటి అధికార టీడీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి నాసిరకంగా పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టడంతో తరచూ పైప్‌లైన్లు దెబ్బతినడంతో పట్టణ ప్రజలకు శాపంగా మారింది. మూడు నెలల క్రితం తొలి ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీరు చేరే కావలి-కడప రోడ్డులో ఉన్న పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. పైప్‌లైన్ పూర్తిగా ధ్వంసం కావడంతో ఆ తరహా పైప్‌లు ఎక్కడా అందుబాటులో లేని పరిస్థితి. దీంతో తాత్కాలికంగా దారి మళ్లించి నీటి సరఫరా పూర్తిగా ఆగిపోకుండా చర్యలు తీసుకున్నారు. ఈ పైప్‌లు ఒక్క హైదరాబాద్‌లో మినహా ఎక్కడా అందుబాటులో దొరికే పరిస్థితి లేకపోవడంతో అక్కడ ఉన్న పైప్‌లైన్ తయారీదారుతో ప్రత్యేకంగా పైప్‌ను తయారు చేయించి తీసుకురావాల్సి వచ్చింది. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పైప్‌లైన్ తయారు సంస్థతో అను నిత్యం సంప్రదింపులు చేస్తూ ఉండడంతో ఎట్టకేలకు అవసరమైన కొత్త పైప్‌లైన్ కావలికి చేరుకుంది. ఎట్టకేలకు పైప్‌లైన్ కావలికి చేరుకోవడంతో మరమ్మతులు పనులు శనివారం మున్సిపల్ సిబ్బంది ప్రారంభించారు.


కావలి-కడప రోడ్డులో అడ్డంగా పైప్‌లైన్ మరమ్మతుల పనులు జరుగుతున్న దృశ్యం

తాళ్లూరు సుజాతమ్మకు ఘననివాళి

కావలి: దగదర్తి ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరు ప్రసాద్ నాయుడు తల్లి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ తాళ్లూరు రమణయ్యనాయుడు సతీమణి తాళ్లూరు సుజాతమ్మ 6వ వర్ధంతిలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. దగదర్తిలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. తాళ్లూరు సుజాతమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో పాటు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


సుజాతమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కోడి పందెం స్థావరాలపై దాడులు

కొండాపురం: మండలంలోని సత్యవోలు శివారులో నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరంపై కొండాపురం ఎస్సై షేక్ ఖాజావలి శనివారం సాయంత్రం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,400 నగదును, మూడు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిని సోమవారం కోర్టులో హాజరు పరుచనున్నట్లు వివరించారు.

ఈ నెల 31లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

జలదంకి: మండలంలోని రైతులందరూ ఈ నెల 31వ తేదీ లోగా తమ పంట వివరాలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల ఏఓ బి. శైలజ శనివారం తెలిపారు. రైతులు పాస్‌బుక్, 1బీ, ఆధార్ కార్డు తీసుకెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ నమోదుతో రైతు భరోసా, పీఎం కిసాన్, పంటల ఇన్సూరెన్స్, సబ్సిడీ ద్వారా విత్తనాలు, ఎరువులు వ్యవసాయ పనిముట్లు అందుతాయని వివరించారు.

కుష్టువ్యాధి సర్వే పరిశీలన

వరికుంటపాడు: మండలంలో గత నెల 27 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ఆరోగ్య, ఆశ కార్యకర్తలు నిర్వహించిన కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వేను శనివారం కందుకూరు డివిజన్ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఆయన సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజుతో కలిసి మండలంలోని నల్లబోతులవారిపల్లె, గొల్లపల్లి, విరువూరు, యర్రంరెడ్డిపల్లి, కాంచెరువు, గువ్వాడి తదితర గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో కొత్తగా ఒక కుష్టు వ్యాధి కేసును గుర్తించారు.

నేడు కృష్ణంపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉదయగిరి: మండలంలోని కృష్ణంపల్లె సచివాలయ పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి ఈశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి అధికారులు, వలంటీర్లు సచివాలయ సిబ్బంది, ప్రతినిధులు తదితరులు పాల్గొనాలన్నారు.

చెరువులో చేపల పెంపకానికి లీజు వేలం

చేజర్ల: మండలంలోని చేజర్ల చెరువులో చేపలు పెంచుకుని పట్టి అమ్ముకునేందుకు లీజు వేలం స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొండా రమణారెడ్డి రూ.12.26 లక్షలకు పాటను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, ఈఓపీఆర్డీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా ప్రణాళికలు

- వాటర్ పంపింగ్ హౌస్‌ను పరిశీలించిన నెల్లూరు మేయర్

సంగం: నెల్లూరు నగరపాలక సంస్థలో వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకుంటున్నామని, ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని నెల్లూరు నగర మేయర్ స్రవంతి తెలిపారు. సంగం బ్యారేజ్ వద్ద మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి వాటర్ పంపింగ్ హౌస్‌ను శనివారం కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసులుయాదవ్, విజయలక్ష్మితో కలిసి సందర్శించారు. పంపింగ్ హౌస్‌లో వాటర్ మేనేజ్‌మెంట్‌ను అధికారును అడిగి తెలుసుకున్నారు. లాగ్‌బుక్ మెయింటెనెన్స్ మోటార్ల పని తీరును పరిశీలించి, పంపింగ్ హౌస్‌లో తలెత్తే చిన్న చిన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.


పంప్ హౌస్ పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

నవోదయ ప్రవేశ పరీక్షలు

దుత్తలూరు: జిల్లాలోని కృష్ణాపురం నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. దుత్తలూరు ఏపీ మోడల్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షలు నిర్వహించారు. మోడల్ పాఠశాలలో 153 మంది హాజరు కాగా, 87 మంది గైర్హాజరయ్యారు. దుత్తలూరు ఉన్నత పాఠశాలలో 136 మంది విద్యార్థులు హాజరు కాగా, 62 మంది గైర్హాజరయ్యారు.

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 240 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 111 మంది హాజరయ్యారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు.

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ విధుల నుంచి తొలగింపు

ఉదయగిరి: ఉదయగిరి గృహ నిర్మాణ శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.హర్షవర్ధన్‌రెడ్డిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 29న ఉదయగిరి శ్రీనగర్‌కాలనీలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు టీడీపీ నాయకులు వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి నిర్మిస్తున్న ఇంటికి ప్రభుత్వ సిమెంట్ వాడుతున్నారంటూ నానా యాగీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన కలెక్టర్‌తో పాటు గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ నెల 4న విజయవాడ విజిలెన్స్ అధికారులు ఉదయగిరి చేరుకుని కార్యాలయంలో రికార్డులు, సిమెంట్ గోదామును పరిశీలించారు. హౌసింగ్ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా కలెక్టర్ వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు కేసు నమోదు చేయాలని ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేశారు.

వింత గొర్రెపిల్ల జననం

కలిగిరి: మండలంలోని ఎర్రతోటలో గురజాల రత్తయ్యకు చెందిన గొర్రెకు శనివారం వింత గొర్రెపిల్ల పుట్టింది. ఒక తల, 8 కాళ్లతో జన్మించగా పది నిమిషాలకే మృతి చెందింది. దీనిని చూసేందుకు జనం ఆసక్తి కనబరిచారు.

